


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
25 అక్టోబర్ 2024
పేజీలు: 02

# పొట్టేల్ రివ్యూ




సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో యువ చంద్ర కృష్ణ హీరోగా అనన్య నాగళ్ల హీరోయిన్ గా నటించిన మూవీ పొట్టేల్. కాగా ఈ చిత్రం ఈ రోజే విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించిందో రివ్యూలోకి వెళ్లి తెలుసుకుందాం ! ఈ పొట్టేల్ కథ 1970, 80వ దశకంలో సాగుతుంది. మహారాష్ట్ర, తెలంగాణ బార్డర్ ప్రాంతంలోని ఓ ఊర్లో ఈ కథ నడుస్తుంది. ఆ ఊరి గ్రామ దేవత బాలమ్మకు పుష్కరానికి ఓ సారి జాతర చేసి పొట్టేల్‌ను బలి ఇవ్వాలనేది ఆ ఊరి కట్టుబాటు, ఆచారం. అలాగే, ఆ ఊరి పటేల్‌కు బాలమ్మ పూనుతుందని అక్కడి జనం గుడ్డిగా నమ్ముతూ ఉంటారు. అయితే, ఆ ఊరి పటేల్ (అజయ్)కి మాత్రం చిన్న తనం నుంచి బాలమ్మ పూనదు. ఈ నేపథ్యంలో బాలమ్మ పూనకం ముసుగులో పటేల్ రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తుంటాడు. మరోవైపు, పెద్ద గంగాదరీ( యువ చంద్ర) తనకి ఇష్టం లేకుండానే చిన్నతనం నుంచే వారసత్వపు వృత్తిగా వచ్చిన గొర్రెలని మేపుతూ లైఫ్ ని లీడ్ చేస్తుంటాడు. అందులో భాగంగానే 'బాలమ్మ' అమ్మవారి అనుగ్రహంగా ఊరి వాళ్ళు భావించే 'పొట్టెల్'ని పెద్ద గంగాదరీ పెంచుతుంటాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల క్రమంలో పటేల్‌కు వ్యతిరేకంగా పెద్ద గంగాదరీ తన కూతురు సరస్వతిని టీచర్ దుర్యోధన్ (శ్రీకాంత్ అయ్యంగార్) సాయంతో ఎలా చదివించాడు ?, అసలు పెద్ద గంగాదరీకి చదువు పై ఎందుకు అంత మమకారం ?, తనకు చదువు లేకపోవడం వల్ల పెద్ద గంగాదరీ జీవితంలో ఏం కోల్పోయాడు ?, ఇంతకీ పెద్ద గంగాదరీ చదువు విషయంలో ఏం సాధించాడు ? అనేది మిగిలిన కథ. ఒకప్పుడు తెలంగాణలోని పటేల్ వ్యవస్థ వల్ల బడుగుబలహీన వర్గాలు, దళిత ప్రజలు ఎలా ఇబ్బంది పడ్డారు ?, అప్పట్లో బానిసలుగా ఎంతగా నలిగిపోయేవారో.. ముఖ్యంగా చదువు విషయంలో దళిత వర్గాల పిల్లలు ఎంత అన్యాయానికి గురి అయ్యారో ఈ సినిమాలో చాలా చక్కగా చూపించారు. అదేవిధంగా కూతురిని చదివించడం కోసం ఓ తండ్రి పడే తపన, ఆవేదన సినిమాలో ఆకట్టుకుంది. నలభై, యాభై ఏళ్ల క్రితం నాటి కథా నేపథ్యం కాబట్టి, అప్పటి పరిస్థితులకు తగ్గట్టు పాత్రల చిత్రీకరణతో పాటు సెటప్ ను కూడా బాగా డిజైన్ చేశారు. ఈ క్రమంలో పటేల్ కి, హీరోకి మధ్య జరిగే డ్రామా కూడా బాగుంది. ఇక చిన్నారి సెంటిమెంట్, బాలమ్మ (అమ్మోరు) ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. నటీనటుల విషయానికి వస్తే.. యువ చంద్ర పాత్ర బాగుంది. తన పాత్రలో యువ చంద్ర కూడా చాలా చక్కగా నటించాడు. కొన్ని ఎమోషనల్ సన్నివేశాల్లో తన రియలిస్టిక్ యాక్టింగ్ తో ఆకట్టుకున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన అనన్య నాగళ్ల కూడా తన నటనతో ఆకట్టుకుంది. కొన్ని ఎమోషనల్ సన్నివేశాల్లో ఆమె తన పెర్ఫార్మెన్స్ తో మెప్పించింది. మరో కీలక పాత్రలో నటించిన అజయ్ చాలా బాగా నటించాడు. సినిమాకే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాడు. అలాగే, ఛత్రపతి శేఖర్, తనస్వి చౌదరి,ప్రియాంక శర్మ, నోయల్, శ్రీకాంత్ అయ్యంగార్ మరియు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రల్లో మెప్పించారు. ఈ సినిమాలో ఎమోషన్స్ ని ఎఫెక్టివ్ గా హ్యాండిల్ చేసిన డైరెక్టర్, కొన్ని కీలక సన్నివేశాలను మాత్రం చాలా స్లోగా సాగదీశాడు. నిజానికి కథా నేపథ్యం తాలూకు సన్నివేశాలను బాగా రాసుకున్నప్పటికీ.. మిగిలిన సన్నివేశాల్లో ముఖ్యంగా సెకండ్ హాఫ్ మధ్యలో వచ్చే సీన్స్ ను ఇంకా బాగా ఆసక్తికరంగా మలిచి ఉండాల్సింది. అలాగే, తెలంగాణలోని పటేల్ వ్యవస్థ కాలం నాటి ఎలిమెంట్స్ ఇప్పటి తరానికి అంత ఆసక్తికరంగా అనిపించకపోవచ్చు. ఐతే, ఆ వ్యవస్థ ఎలా ఉండేదనేది ఈ జనరేషన్‌కి చెప్పే ప్రయత్నాన్ని మాత్రం అభినందించాలి. కాకపోతే, ఆ ప్రయత్నం ఇంకా ఇంట్రెస్టింగ్ గా ఉండి ఉంటే సినిమాకి మేలు జరిగేది. అదే విధంగా హీరో పాత్రను ఇంకా బలంగా రాసుకోవాల్సింది. మంచి కథా నేపథ్యాన్ని తీసుకోవడంలో సక్సెస్ అయిన దర్శకుడు సాహిత్ మోత్కూరి, కొన్ని చోట్ల ఉత్కంఠభరితమైన సీన్స్ ను రాసుకోవడంలో మాత్రం కొన్ని చోట్ల తడబడ్డాడు. కానీ, ఆయన రూపొందించిన సన్నివేశాలు బాగానే ఉన్నాయి. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర సంగీతం బాగుంది. సినిమాటోగ్రఫీ వర్క్ సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎడిటింగ్ కూడా బాగుంది. ఇక దర్శకుడు ఆలోచనను నమ్మి ఇలాంటి వైవిధ్యమైన చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించినందుకు నిర్మాతలను అభినందించాలి. నిర్మాతలు 'సురేశ్ కుమార్ సడిగే, నిశాంక్ రెడ్డి కుడితి'ల నిర్మాణ విలువులు చాలా బాగున్నాయి. 'పొట్టేల్' అంటూ వచ్చిన ఈ ఎమోషనల్ పీరియాడిక్ డ్రామా.. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తోంది. ముఖ్యంగా కథా నేపథ్యం, కొన్ని ఎమోషనల్ ఎలిమెంట్స్ ఆకట్టుకుంటాయి. అయితే, స్క్రీన్ ప్లే స్లోగా సాగడం, కొన్ని సీన్స్ ఆసక్తికరంగా లేకపోవడం వంటి అంశాలు బలహీనతలుగా నిలుస్తాయి. ఓవరాల్ గా భిన్నమైన, కొత్త తరహా ఎమోషనల్ డ్రామాలను ఇష్టపడేవారికి ఈ సినిమా నచ్చుతుంది.



## క్యూరియాసిటీ పెంచుతున్న కిరణ్ అబ్బవరం క ట్రైలర్

టాలీవుడ్ యాక్టర్ కిరణ్ అబ్బవరం నటిస్తోన్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ క. 970స్ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణగిరి గ్రామం బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సుజిత్-సందీప్ డైరెక్ట్ చేస్తున్నారు. మూవీ లవర్స్ ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న క ట్రైలర్ రానే వచ్చింది. ట్రైలర్ సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సాగుతూ క్యూరియాసిటీ పెంచుతోంది. ఇదివరకెన్నడూ నయా అవతార్‌లో ఎంటర్‌టైన్ చేయబోతున్నట్టు ట్రైలర్ చెప్పకనే చెబుతోంది. టైం ట్రావెల్ కథాంశం చుట్టూ తిరిగే క చిత్రంలో 2018 ఫేం తాన్వి రామ్, గం గం గణేశా ఫేం నయన్ సారిక ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



## ఎన్సీపీలో చేరిన బాబా సిద్ధిక్ కుమారుడు జీషాన్ సిద్ధిక్

మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిక్ కుమారుడు జీషాన్ సిద్ధిక్.. అజిత్ పవార్‌కు చెందిన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆగస్టులో జీషాన్‌ను వెలివేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ నేపథ్యంలో ఆ చర్య తీసుకున్నది. బాంద్రా ఈస్ట్ నుంచి జీషాన్ ఎన్సీపీ టికెట్‌పై పోటీ చేయనున్నారు. 2019 ఎన్నికల్లో ఆ స్థానం నుంచి వరుణ్ సర్దేశాయ్‌పై పోటీ చేసి గెలిచారు. మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ థాక్రే మేనేల్లుడు వరుణ్‌పై ఆయన విజయం సాధించారు. తన తండ్రి బాబా సిద్ధిక్ హత్యకు గురైన తర్వాత కాంగ్రెస్ కూటమి తనను బహిష్కరించిందని జీషాన్ తెలిపారు. తనకు, తన కుటుంబానికి ఇది భావోద్వేగభరితమైన రోజు అని, అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్, సునిల్ తత్కరేలకు రుణపడి ఉన్నట్లు పేర్కొన్నారు. బాంద్రా ఈస్ట్ నుంచి తనకు సీటు వచ్చిందని, ప్రజల అభిమానంతో మళ్లీ గెలుస్తానన్న నమ్మకం ఉందని జీషాన్ సిద్ధిక్ తెలిపారు. అక్టోబర్ 12వ తేదీన జీషాన్ సిద్ధిక్ ఆఫీసు వద్ద బాబా సిద్ధిక్ హత్య జరిగిన విషయం తెలిసిందే.

## నేడు ధర్నాచౌక్ వద్ద బీజేపీ మహాధర్నా

మూసీ పునరుజ్జీవంలో భాగంగా నిర్వాసితుల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర బీజేపీ నేతలు హైదరాబాద్‌లో మహాధర్నా చేయనున్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ పేదల ఇళ్లను కూల్చివేయడం సరికాదంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాచౌక్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో ఎలా దోచుకుందో కాంగ్రెస్ కూడా ఇప్పుడు అలాగే చేస్తోందని ఆయన ఆరోపించారు.

## డేవిడ్ వార్నర్‌పై 'జీవిత కాల కెప్టెన్సీ' నిషేధం ఎత్తివేత




ఇటీవల తన టెస్టు రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకుంటానని ప్రకటించిన ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు ఊరటనిచ్చే వార్తను ఆ దేశ బోర్డు వెల్లడించింది. ఇప్పటివరకు అతడిపై ఉన్న 'కెప్టెన్సీ' నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆస్ట్రేలియా క్రికెట్‌బోర్డు నిర్ణయం తీసుకుంది. 2018లో సాండ్‌పేపర్ స్కాండల్ నేపథ్యంలో వార్నర్ 'జీవితకాల నాయకత్వం'పై నిషేధం పడింది. తనపై బ్యాన్‌ను తొలగించాలని ఇప్పటికే వార్నర్ విజ్ఞప్తి చేశాడు. ముగ్గురితో కూడిన రివ్యూ ప్యానెల్ సమీక్షించిన అనంతరం ఏకగ్రీవంగా నిర్ణయాన్ని ప్రకటించింది.

## ది రాజా సాబ్ రికార్డుల వేట స్టార్ట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు మారుతీతో చేస్తున్న అవైటెడ్ హారర్ థ్రిల్లర్ సినిమా "ది రాజా సాబ్" కూడా ఒకటి. మరి మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ లు హీరోయిన్స్ గా నటిస్తున్న ఈ సినిమా నుంచి మేకర్స్ నిన్న ప్రభాస్ బర్త్ డే కానుకగా ఒక ఊహించని కొత్త లుక్ సహా దానిపై ఇంట్రెస్టింగ్ మోషన్ పోస్టర్ టీజర్ ని కూడా వదిలారు. మరి ఈ పోస్టర్ అయితే అదిరిపోగా ఆ వీడియో టీజర్ కి రికార్డు బ్రేకింగ్ రెస్పాన్స్ నమోదు అయినట్టుగా తెలుస్తుంది. మన టాలీవుడ్ నుంచి ఇప్పుడు వరకు వచ్చిన ఎన్నో మోషన్ పోస్టర్ టీజర్ లను మించి దీనికి ఏకంగా 8.3 మిలియన్ వ్యూస్ 24 గంటల్లో వచ్చేసాయి. దీనితో ఆల్ టైం హైయెస్ట్ రెస్పాన్స్ తో ది రాజా సాబ్ అయితే రికార్డుల వేట షురూ చేసాడని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.






## మళ్లీ ఫామ్‌లోకి డొనాల్డ్ ట్రంప్!

అమెరికా అధ్యక్ష రేసులో డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పుంజుకున్నారు. డెమొక్రాట్ అభ్యర్థి కమలా హ్యారిస్‌పై 2.5 పర్సంటేజీ పాయింట్ల తేడాతో ముందుకెళ్లారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ సర్వేలో 2 వారాలు వీరిద్దరూ నెక్ టు నెక్ పోటీపడ్డారని పొలిటికో సంస్థ తెలిపింది. కమల రేటింగ్ 49% నుంచి 45కు తగ్గగా ట్రంప్ 45 నుంచి 48కి పెరిగారు. ఇలాంటి సిచ్యువేషన్లో విజేత ఎంపికలో స్వింగ్ స్టేట్స్ అత్యంత కీలకమవుతాయని పొలిటికో పేర్కొంది.



## ఆధార్ కార్డుపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

వయసు నిర్ధారణకు ఆధార్ కార్డ్ చెల్లదని సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. స్కూల్ సర్టిఫికెట్లను ప్రమాణికంగా తీసుకోవాలని స్పష్టం చేసింది. వయసు నిర్ధారణకు ఆధార్‌ను ప్రమాణికంగా తీసుకుంటూ పంజాబ్, హరియాణా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి తరఫు కుటుంబానికి పరిహారం నిర్ణయించేందుకు ఆధార్‌ను ప్రమాణికంగా తీసుకోవడంతో పరిహారం తగ్గడంపై ఆ కుటుంబం పిటిషన్ దాఖలు చేసింది.



## నేడు సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

దీపావళి బోనస్‌ను ఈరోజు సింగరేణి కార్మికుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. ఒక్కో కార్మికుడికి ₹93,750 అందనుంది. మొత్తంగా ₹358కోట్లు విడుదల చేయాలని సింగరేణిని ఆదేశించింది. ఈ బోనస్ సింగరేణిలో పనిచేస్తున్న 40వేల మందికి అందనుంది. ఇటీవల సంస్థ పొందిన లాభాల్లో 33% వాటా పంచగా ఒక్కో కార్మికుడికి ₹1.90లక్షలు అందాయి. పండుగ అడ్వాన్స్ కింద మరో ₹25వేలు అందాయి. మొత్తంగా ఒక్కొక్కరికి ₹3లక్షల ప్రయోజనం అందింది.




## ఓటీటీలో వచ్చేసిన శ్రీవిష్ణు స్వాగ్

మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లో తన వెర్సటాలిటీ తో అదరగొట్టిన నటుడు శ్రీవిష్ణు కూడా ఒకడు. మరి తను నటించిన లేటెస్ట్ ఇంట్రెస్టింగ్ సినిమానే "స్వాగ్". దర్శకుడు హసిత్ గోలితో చేసిన ఈ సినిమా తమ కాంబినేషన్లో ఆల్రెడీ రాజ రాజ చోర వంటి క్లీన్ హిట్ తర్వాత మరి ఈ సినిమాలో మంచి కంటెంట్ ని మించి శ్రీవిష్ణు తన పెర్ఫార్మన్స్ తో ఆశ్చర్య చకితులను చేసాడని చెప్పాలి. డిఫరెంట్ గెటప్స్ డిఫరెంట్ వేరియేషన్ లతో తన నట విశ్వరూపంతో అదరగొట్టిన ఈ సినిమా ఇప్పుడు సర్ప్రైజింగ్ గా ఓటీటీలోకి వచ్చేసింది. మరి ఈ సినిమా హక్కులు ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకోగా ఇందులో ఈ సినిమా నేటి నుంచి స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఇక ఈ సినిమాలో రీతూ వర్మ హీరోయిన్ గా నటించగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహించారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# హాట్‌గా కియారా

ఇప్పుడు కాస్త తగ్గింది కానీ, మొన్న మొన్నటిదాకా సౌత్‌లో ఏ టాప్ హీరో సినిమా మొదలవుతుందనుకున్నా, వెంటనే హీరోయిన్ల పేర్లలో కియారా అద్వానీ పేరు బ్లింక్ అయ్యేది. మేకర్స్ అఫిషియల్‌గా అనౌన్స్ చేసే వరకు వైరల్ అవుతూనే ఉండేది ఆమె పేరు.. ఇప్పుడు లేటెస్ట్ గా కియారా గురించి ఏం వార్తలు నడుస్తున్నాయ్ అంటారా.? కియారా అద్వానీ ఇప్పుడు ఏం చేస్తున్నారు అనగానే.. జరగండి జరగండి అంటూ రామ్‌చరణ్‌తో ఆమె ఆడిపాడిన గేమ్ చేంజర్ పాట మాత్రమే గుర్తుకొస్తుంది. ఇప్పుడు ఈ జోనర్‌లో కూడా కియారా తనను తాను ప్రూవ్ చేసుకుంటే, ప్యాన్ ఇండియా లెవల్లో ఆల్ రౌండర్స్ అని పేరు తెచ్చుకున్న నాయికల్లో కియారా నేమ్ మరింత స్ట్రాంగ్‌గా ఉంటుందన్నమాట. దాదాపు నాలుగు రోజుల పాటు ముంబైలో ఈ సీక్వెన్స్ తెరకెక్కించారు. ఆల్రెడీ యాక్షన్ జోనర్‌లో ప్రూవ్ చేసుకున్నారు దీపిక, నయన్, ఆలియా అండ్ అదర్స్.







## తీరం దాటిన దానా
# తీవ్ర తుపాను

తీవ్ర తుపాను 'దానా' తీరం దాటింది. అర్ధరాత్రి 1:30 నుండి 3:30 మధ్య తీరాన్ని తాకింది. ఒడిశాలోని బిత్తర్‌కని నేషనల్ పార్క్, ధమ్రా మధ్య తీరాన్ని తాకినట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. తీరం దాటే సమయంలో గంటకు 110 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఒడిశా సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. ఉత్తరాంధ్ర పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. భద్రక్, జగత్సింగ్‌పూర్, బాలాసోర్‌లో భారీ వర్షం కురుస్తోంది. పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఒడిశాలో 7వేల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని హైరిస్క్ జోన్ల నుంచి ఆరు లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుపాను ప్రభావంతో ఏకంగా 400లకు పైగా రైళ్లు రద్దు అయ్యాయి. కోల్‌కతా, భువనేశ్వర్ ఎయిర్‌పోర్ట్‌ల్లో సేవలను గురువారం సాయంత్రం నుంచే నిలిపివేశారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుపాను కదలికలను ఇస్రో ప్రయోగించిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్-06), ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూ వస్తున్నాయని ఇస్రో తన అధికారిక వెబ్‌సైట్‌లో గురువారం తెలియజేసింది. 2022 నవంబర్ 26న పీఎస్ఎల్‌వీ సీ-54 రాకెట్ ద్వారా ప్రయోగించిన ఈఓఎస్-06, 2016 సెప్టెంబర్ 8న జీఎస్ఎల్‌వీ ఎఫ్-05 రాకెట్ ద్వారా ప్రయోగించిన ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాలు విపత్తులను ముందస్తుగా గుర్తించి మానవాళికి మేలు చేస్తుండటంలో ప్రముఖపాత్ర పోషిస్తున్నాయనడానికి ఇదే నిలువెత్తు నిదర్శనం. ఈ నెల 20న బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను సముద్రపు గాలి నమూనాలను బట్టి ఈఓఎస్-06 ఉపగ్రహం ముందస్తుగా గుర్తించింది. మేఘాలను బట్టి ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహం ఈ తుపానును ముందస్తుగా గుర్తించింది. తుపాను బెంగాల్, ఒడిశా మీదుగా వెళ్లి తీరం దాటింది. ఈ విషయాన్ని ఈ రెండు ఉపగ్రహాలు ముందస్తుగా ఇచ్చిన సమాచారంతో అధికారులు అప్రమత్తమై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడ్డాయి. దీనివల్ల ఆస్తినష్టం, ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకునే అవకాశం చిక్కింది.





## అమరావతి రైల్వే లైన్..
# కొత్త స్టేషన్లు ఇవే

ఖమ్మం ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు నిర్మించే అమరావతి రైల్వే లైన్‌లో 9 స్టేషన్లు నిర్మించనున్నారు. కాజీపేట-విజయవాడ లైన్‌లోని ఎర్రుపాలెం నుంచి ట్రాక్ మొదలై గుంటూరు-విజయవాడ రూట్‌లోని నంబూరులో కలుస్తుంది. పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరులో కొత్త స్టేషన్లు వస్తాయి. అమరావతి, పెద్దాపురం, కొప్పురావూరు స్టేషన్లు పెద్దగా నిర్మిస్తారు. రూ.26వేల కోట్లతో అమరావతి ఓఆర్ఆర్ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును రూ.26వేల కోట్లతో 189కి.మీ మేర నిర్మించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నిన్న సీఎంతో ఎన్‌హెచ్ఐ అధికారుల భేటీలో ఓఆర్ఆర్‌తో పాటు కుప్పం-హోసూర్-బెంగళూరు రోడ్డును రూ.300 కోట్లతో 56కి.మీ మేర, మూలపేట-విశాఖ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును రూ.8300 కోట్లతో 165కి.మీ మేర, హైదరాబాద్-విజయవాడ మధ్య రూ.8వేల కోట్లతో 6/8 వరుసలతో 226కి.మీ మేర నిర్మించే అంశాలపై చర్చించారు.



## హ్యాపీ "కోడి కత్తి డే"
# జగన్: టీడీపీ

2018లో విశాఖలో వైఎస్ జగన్‌పై దాడికి ఆరేళ్లు పూర్తయ్యాయని టీడీపీ ట్వీట్ చేసింది. 'హ్యాపీ "కోడి కత్తి డే" జగన్. 6 ఏళ్ల క్రితం తమరు ఇచ్చిన పర్ఫార్మెన్స్, నెవర్ బిఫోర్, ఎవర్ ఆఫ్టర్. తల్లి, చెల్లి మీద కోర్టుకి వెళ్లడం కాదు. ఈ కేసులో కోర్టుకి వచ్చి సాక్ష్యం చెప్పి దళిత యువకుడి జీవితం నిలబెట్టు' అని సెటైర్లు వేసింది. కోడికత్తి లాంటి ఆయుధంతో దాడి చేసినా నేరం కాదని టీడీపీ ప్రకటించిందంటూ దీనికి వైసీపీ బదులిచ్చింది.

## ఇండియాలో ఏ భాష వినియోగం ఎక్కువ?

దేశంలోని చాలా రాష్ట్రాల్లో హిందీ భాష వినియోగంలో ఉంది. ఓ నివేదిక ప్రకారం దాదాపు 52.82 కోట్ల మంది హిందీ మాట్లాడతారు. బెంగాలీని 9.72కోట్ల మంది మాట్లాడితే 8.30 కోట్ల మంది మరాఠీలో సంభాషిస్తారు. ఇక 8.11 కోట్ల మంది తెలుగు, 6.90 కోట్ల మంది తమిళం మాట్లాడుతున్నారు. 5.54 కోట్ల మంది గుజరాతీ, 5.07 కోట్ల మంది ఉర్దూ, కన్నడ భాషను 4.37 కోట్లు, 3.75 కోట్ల మంది ఒడియా, మలయాళం మాట్లాడేవారు 3.48 కోట్ల మంది ఉన్నారు.

## నేటి నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

ఇవాళ్టి నుంచి నవంబర్ 1 వరకు మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా జార్జియా ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో ఆయన ప్రసంగిస్తారు. పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చిస్తారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో రేపు ఒరాకిల్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్నారు.

## హైడ్రాకు 100 రోజులు.. బీఆర్ఎస్ పార్టీ విమర్శలు

'హైడ్రా'కు 100 రోజులు పూర్తవడంతో ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ విమర్శలు గుప్పించింది. 'రేవంత్ సర్కార్ హైడ్రా పేరుతో పేదల జీవితాలను రోడ్డుకీడ్చింది. వెయ్యెలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలు చేసినట్టు కబ్జాలు ప్రోత్సహించిన కాంగ్రెస్ పరిరక్షణ పేరుతో డ్రామాలాడుతోంది. పేదలకు నోటీసులు ఇవ్వకుండా కూలగొట్టేందుకు మనసెలా వచ్చింది? అనుముల తిరుపతిరెడ్డి ఇంటి ఒక్క ఇటుకనైనా ఎందుకు ముట్టలేకపోయింది?' అని ప్రశ్నించింది.

## సమోసా, చిప్స్, ఫాస్ట్‌ఫుడ్స్‌తో
# డయాబెటిస్

అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ మధుమేహానికి దారి తీస్తోందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తేల్చింది. సమోసా, పకోడి, ఫ్రైడ్ చికెన్, చిప్స్, కేక్స్, ఫాస్ట్ ఫుడ్స్ రక్తంలో చక్కెర స్థాయులను పెంచుతున్నట్లు నిర్ధారించింది. ఇవి శరీరంలో హానికరమైన అడ్వాన్స్‌డ్ గ్లైకేషన్ ఎండ్ ప్రొడక్ట్స్‌గా మారి ఇన్సులిన్ నిరోధకతను దెబ్బతీస్తున్నాయి. దీంతో టైప్-2 మధుమేహం, ఊబకాయానికి దారితీస్తున్నట్లు పరిశోధకులు తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా
# 1000కి.మీ పాదయాత్ర

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల ఆధ్వర్యంలో మహా పాదయాత్రకు దళితులు సిద్ధం అవుతున్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు సాగే పాదయాత్రను మాజీ ఎంపీ హర్షకుమార్ ఇవాళ ప్రారంభిస్తారు. 38 రోజుల పాటు 16 జిల్లాలు, 35 నియోజకవర్గాల మీదుగా 1000కి.మీ మేర ఈ పాదయాత్ర సాగనుంది. డిసెంబర్ 1న ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు ప్రణాళికలు రచిస్తున్నారు.

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు లైన్ క్లియర్?

వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకులు తొలగుతున్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 150కి.మి పరిధిలో 2038 వరకూ వాణిజ్య ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయవద్దనే రూల్‌ను పక్కన పెట్టేందుకు జీఎంఆర్ సంస్థ అంగీకరించినట్లు తెలుస్తోంది.